క్లుప్తంగా

నేడు 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'

నరసరావుపేట రూరల్: గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం ఈనెల 10వ తేదీ ఆదివారం ఉదయం 7గంటలకు పట్టణంలో నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఉదయం 7గంటలకు గుంటూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నుంచి కార్యకమం ప్రారంభమవుతుందని తెలిపారు.

రహదారి నిర్మాణం పరిశీలన

వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లి సాయిబాబా గుడి దగ్గర నుంచి బ్రాహ్మణపల్లి తారురోడ్డు వరకు ఎన్ఎస్‌పీ కాలువపై రెండు వైపులా రోడ్డు నిర్మాణాన్ని ఎంపీపీ నిధుల ద్వారా పూర్తి చేయడం జరిగింది. ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, వజ్రాల కృష్ణారెడ్డి, గ్రామరైతులు పూర్తయిన రోడ్డును శనివారం పరిశీలించారు.యాదాల శంకరరావు, పెనుమాల సుమలత, మల్లయ్య, కాంట్రాక్టర్ పెద్దిరెడ్డి రామిరెడ్డి, రైతులు వై.వెంకటేశ్వరరావు, పగడాల చిన్నకోటిరెడ్డి, కంటా రంగారావు, పగడాల కేశవరెడ్డి, గాయం చంద్రరెడ్డి, ఏరువ బ్రహ్మారెడ్డి, నిశ్శంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



వినుకొండ: పట్టణంలోని మసీదుమాన్యంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారులు ప్రజలకు నాటుసారా, గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ వినీల మాట్లాడుతూ వినోదం కోసం సారా, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడిన యువత పెడత్రోవ పడుతుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు, చైన్ స్నాచింగ్, ఇతర నేరాలకు పాల్పడతారని తెలిపారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యపరంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని తెలియజేశారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లపాడులో వాహనాల తనిఖీ



యడ్లపాడు: పోలీసుల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వాహనాల విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తిమ్మాపురం హైవే బైపాస్ వద్ద ఎస్ఐ టి.శివరామకృష్ణ నేతృత్వంలో పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. తనిఖీల సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వంటి సరైన పత్రాలు లేని వాహనదారులను నిలిపివేసి హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని, వీరిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఎస్ఐ శివ రామకృష్ణ స్పష్టం చేశారు.

నేడు నాదెండ్లలో ఉచిత వైద్యశిబిరం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల శ్రీ గంగాపార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన డాక్టర్ నల్లమోతు ప్రవీణ్ శనివారం తెలిపారు. తనతో పాటు న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారికి వైద్య చికిత్సలకు సిఫార్సు చేస్తామన్నారు. ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో విఖనస జయంతి



నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీలీలా వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ పూర్ణిమను పురస్కరించుకొని శనివారం శ్రీవిఖనస మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీవైఖనస పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం (తిరుపతి) అధ్యాపకుడు డాక్టర్ నారాయణం తనూజ్ విష్ణువర్ధన్ పాల్గొని శ్రీవిఖనస మహర్షి ఆలయ సంస్కృతికి చేసిన కృషిని వివరించారు. ఆలయాల నిర్మాణం, వాస్తు, ప్రతిష్ఠ, అర్చన, స్నపన తదితర పూజాధికాలు నిర్వహణకు దిశా నిర్దేశం చేశారని తెలిపారు. ఆలయ చైర్మన్ కె.పి.రంగారావు, డాక్టర్ వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్, వైఖానస పరిషత్ ప్రతినిధులు రొంపిచర్ల ఆంజనేయులు, నారాయణం సత్యనారాయణ ప్రసాదు, ఆర్ఎస్ఎ ప్రసాదు పాల్గొన్నారు.

అవిరళ కృషికి ఉత్తమ పురస్కారం

- విద్యాశాఖ రాష్ట్రస్థాయి పురస్కారానికి చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జెడ్పీ హైస్కూలు ఎంపిక
- పదోతరగతి ఫలితాలు, పాఠశాల నిర్వహణలో ఘనత
- స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం చేతుల మీదుగా పురస్కారం



చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్ల శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్ర విద్యాశాఖ పురస్కారానికి ఎంపికైంది. పదో తరగతి పరీక్షా ఫలితాలు, పాఠశాల నిర్వహణలో సత్ఫలితాలు సాధించటంతో ఉత్తమ ఉన్నత పాఠశాల పురస్కారానికి విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు పాఠశాల హెచ్ఎం ఎం.కిశోర్ తెలిపారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న వేడుకల్లో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

నూరుశాతం ఫలితాలు, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు

చిరుమామిళ్ల శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో పదో తరగతి తొలి బ్యాచ్ ప్రారంభమైంది. ఇప్పటివరకు ఏడుసార్లు నూరుశాతం ఫలితాలు సాధించింది. ఈ ఏడాది 66 మంది పరీక్షలు రాయగా, నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పది మంది ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి సత్తా చాటారు. 2021-22లో ముగ్గురు, 2022-23లో ముగ్గురు, 2023-24లో ఇరువురు, 2024-25లో నలుగురు, 2025-26లో పది మంది చొప్పున ఇప్పటివరకు 22 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు.

● ప్రభుత్వం అందించే నిధులతో పాటు గ్రామానికి చెందిన విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి అందిస్తున్న ఆర్థిక సాయంతో పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందుతున్నాయి. దీంతో గ్రామంతో పాటు సమీప గ్రామాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఇక్కడ చదువుకుంటూ తమ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటున్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు అవసరమైన రవాణా ఛార్జీలను రామిరెడ్డి సమకూరుస్తున్నారు. ఉత్తమ ఫలితాలు, పాఠశాల నిర్వహణలో మెరుగైన విధానాలతో ఈ ఏడాది రాష్ట్రస్థాయి అవార్డు సాధించటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు గర్వకారణం



పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా నిలిచాం. ట్రిపుల్ ఐటీల్లో సైతం ఈ ఏడాది పది మంది విద్యార్థులు సీట్లు సాధించారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటూ విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చేయూత విద్యార్థుల ఉన్నతికి ఎంతగానో దోహదపడుతోంది. ఈ ఏడాది రాష్ట్రస్థాయి అవార్డు సాధించటం మాకు గర్వకారణం.

– ఎం.కిషోర్, ప్రధానోపాధ్యాయులు

ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల క్రమశిక్షణతో..



ప్రతి ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించటంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది. విద్యార్థులకు చక్కటి బోధనతో పాటు క్రమశిక్షణ, మానసికంగా ధృడంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాటు పడుతున్నారు. పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించటం హర్షణీయం. ఆర్థిక సమస్యలతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో నా వంతుగా పాఠశాల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తున్నాను.

– నడికట్టు రామిరెడ్డి, విద్యాదాత

వైభవం.. బ్రహ్మోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామివారు

వినుకొండ: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం 4వ రోజుకు చేరుకున్నాయి. ప్రధాన అర్చకులు ఎస్.శ్రవణ్‌కుమార్, సీహెచ్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీ విశ్వక్సేన పూజ, పుణ్యాహం, శ్రీ విఖనస మహర్షి వారికి పంచామృత స్థాపన ఆరాధన, అగ్నిధ్యానం, నిత్య హోమం, కుంభ పూజ, నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. టీవీ ఆర్టిస్టు, జాతీయ అవార్డు గ్రహీత, కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసుడు ఇ.సాయి ఆధ్వర్యంలో మేళతాళాలతో శ్రీవారి అపూర్వ రథోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, ప్రధాన కార్యదర్శి అచ్యుత కృష్ణసుబ్బారావు, కోశాధికారి కొళ్ల రామకోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పాస్టర్ క్రిష్టర్ సేవలు విలువైనవి



పాస్టర్ నందమూరి క్రిష్టర్‌ను అభినందిస్తున్న పట్టణ ప్రముఖులు

చిలకలూరిపేట: ఆధ్యాత్మిక సేవలతో పాటు గత పదేళ్లగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ సామాజిక సేవలు అందిస్తున్న ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయం పాస్టర్ నందమూరి క్రిష్టర్ సేవలు ఎంతో విలువైనవని పలువురు పట్టణ ప్రముఖులు కొనియాడారు. ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయానికి చెందిన పాస్టర్ నందమూరి క్రిష్టర్ ఇటీవల ఆల్ ఇండియా బిషప్స్ అండ్ పాస్టర్స్ ఫెలోషిప్‌కు జాతీయ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు పట్టణ ప్రముఖులు శనివారం ఆయన నివాసంలో క్రిష్టర్‌ను కలసి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా క్రిష్టర్ దైవసేవకులకు సహాయ సహకారాలు అందజేస్తున్నారని చెప్పారు. మదర్‌థెరిస్సా చెప్పినట్లుగా ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్న సూక్తిని ఆచరణలో చూపిస్తూ కరోనా సమయంలోనూ, మణిపూర్ దుర్ఘటనల బాధితులకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. జాతీయ స్థాయిలో ఫెలోషిప్ నాయకత్వం పొందిన ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు అందెల శౌరి, ప్రజా మేనిఫెస్టో కమిటీ కన్వీనర్ మాదాసు భానుప్రసాద్, న్యాయవాది తోట శ్రీనివాసరావు, రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడు అచ్చుకోల మురళీకృష్ణ, కాపు సంఘం నాయకులు మల్లెల శివ నాగేశ్వరరావు, తన్నీరు వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా పుస్తక ప్రేమికుల దినోత్సవం



పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో శనివారం జనవిజ్ఞానవేదిక, షేక్ లాలూ దాదాసాహెబ్ సేవా సమితి సంయుక్తంగా అంతర్జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు, పుస్తకాలను చదవడం ఎలా జీవితం మార్చగలదో విద్యార్థులకు వివరించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు గొప్ప వ్యక్తుల పుస్తకాలను చదివే అవసరాన్ని ఉద్ఘాటించి, ప్రపంచాన్ని మార్చినది పుస్తకాలు అని ఉదాహరణలతో స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు జేవీవీ ప్రచురించిన కథల పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. సభకు వైఎంసీఏ జిల్లా అధ్యక్షుడు చుక్కా విన్సెంట్‌పాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఆర్యవైశ్య కళ్యాణ మంటపం కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి, మస్తాన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శోభన్‌బాబు, వెనుక నిందితులు

వినుకొండ: తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగలను వినుకొండ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని బంగారాన్ని రికవరీ చేసి మీడియా ప్రవేశపెట్టారు. వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామంలో గత నెల 31వ తేదీన రాయని మస్తానయ్య ఇంటిలో దొంగలు పడి 139 గ్రాముల బంగారం దోచుకెళ్లారు. వినుకొండ టౌన్ ఎస్‌హెచ్ఓ శోభన్‌బాబు ఆధ్వర్యంలో కేసులో నిందితులైన పెండ్రాల సముద్రాలు, చిన్నసముద్రాలు, శ్రీనులను వినుకొండ మార్కెట్ యార్డు సమీపంలో పట్టుకుని వారివద్దనుంచి బంగారం రికవరీ చేశారు. కేసు విచారణలో ప్రతిభ చూపిన ఎస్ఐలు సీమర్‌బాషా, స్వర్ణలత, కానిస్టేబుళ్లు తిరుమలరావు, బాలవెంకటేశ్వర్లు, తిరుమల నాయక్, హోంగార్డులు అజ్గర్, కె.శ్రీనివాసరావులను సీఐ అభినందించారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు.

మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరం



మాస్టీన్‌పేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ నాగలక్ష్మి

సత్తెనపల్లి: డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బతింటాయని ముఖ్యంగా కాలేయం,మెదడు, గుండె వంటి ప్రధాన అవయవాలు రోగగ్రస్తమవుతాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. విజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మద్యపానం, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి సత్తెనపల్లి టౌన్ లోని మాస్టీన్‌పేటలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ మద్యపానం వల్ల ఆర్థికంగా చితికి పోవడంతో పాటు శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి జీవితం నరకప్రాయం అవుతుందని తెలిపారు. గంజాయి వంటి డ్రగ్స్ సంబంధిత నేరాల్లో గరిష్ఠంగా 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మద్యానికి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. మద్యపానానికి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి ఎస్ఐ నాగలక్ష్మి, కానిస్టేబుళ్లు కోటయ్య, హనుమ, ఆనంద్, శివ పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



పాలువాయి గ్రామం శివార్లలోని పత్తి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి లక్ష్మారెడ్డి

రెంటచింతల: పత్తిలో సస్యరక్షణ ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని పాలువాయి గ్రామంలో పత్తి పంట సాగుచేస్తున్న పొలాలను పరిశీలించి మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలలో పత్తి పంటలో పచ్చదోమ, తామర పురుగు కనిపిస్తుందని చెప్పారు. నివారణకు ప్రిప్రోనిల్ 2 ఎంఎల్ ఒక లీటర్ నీటికి , లేదా 1.5 గ్రాముల లెసిఫేట్‌ను ఒక లీటర్ నీటికి, లేదా కాన్ఫిడార్ 0.4 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. 50 నుంచి 60 రోజుల పత్తిపంటలో ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షణ బుట్టలను అమర్చుకుని రెక్కల పురుగుల ఉధృతిని నివారించవచ్చునన్నారు. ఒక్కొక్క బుట్టలో 8 రెక్కల పురుగుల చొప్పున రెండు, మూడు రోజులు వరుసగా పడిన 10 పత్తి పువ్వులకు ఒక గుడ్డి పువ్వు, 10 కాయలకు ఒక పుచ్చుకాయ గమనించిన వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా లార్విన్ 1.2 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2 ఎంఎల్ ఒకలీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని కోరారు. గూడ, పూల రాలకుండా 60 రోజులు నుంచి 90 రోజులు పత్తి పంటకు ఒకసారి 1.5 గా. బొరాక్స్‌పొడిని ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకుని నివారంచవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంక్‌శాఖ ద్వారా బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో, మీ- సేవా, రైతు సేవాకేంద్రంలో సిబ్బందిని సంప్రదించి పంటల బీమా చేసుకోవాలని, ఆగస్టు 14వ తేదీ వరకు పంటల బీమా చేయించుకోవడానికి అవకాశం ఉందని వివరించారు. ఎకరా పత్తికి రూ.1900, మిరపకు రూ. 360, వరికి రూ.80, కందికి రూ.40 ప్రీమియం చెల్లించాలన్నారు.

ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా సమస్యల పరిష్కారానికి సీపీఐ అలుపెరగని పోరాటాలు చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాదు తెలిపారు. అరండల్‌పేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వినుకొండలో రెండురోజుల పాటు నిర్వహించిన జిల్లా ద్వితీయ మహాసభలు విజయవంతం కావటంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా నూతన కమిటీ కార్యదర్శిగా తాను రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. మహాసభల్లో పల్నాడు ప్రాంత సమస్యలపై సమగ్రంగా చర్చించి జిల్లా అభివృద్ధికి పలు తీర్మానాలు ఆమోదించినట్టు వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేసారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలిపారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

సత్తెనపల్లి: మంటలు వ్యాపించి ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండలంలోని రెంటపాళ్ల-కొంపెర్లపాడు గ్రామాల మధ్యలో శనివారం జరిగింది. కృష్ణమూర్తి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శబ్దం వచ్చింది. దీంతో నిలిపి చూసేలోగా మంటలు వ్యాపించాయి. ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది.

సీపీఐ జిల్లా సమితిలో సత్తెనపల్లి నుంచి ముగ్గురికి స్థానం

సత్తెనపల్లి: సీపీఐ జిల్లా సమితిలో సత్తెనపల్లి వాసులకు ముగ్గురికి చోటు లభించింది. పట్టణానికి చెందిన మునునూరి రమేష్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, కంబాల శ్రీనివాస్, వల్లెం లక్ష్మీచెన్న కేశవరావును జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు వినుకొండలో జరిగిన రెండో మహాసభలో ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. అమరావతి మండలం మునుగోడు గ్రామానికి చెందిన నేలపాటి మనోహర్ (24) అమరావతిలోని ఓ మిఠాయి దుకాణంలో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మేస్త్రి వద్ద ద్విచక్ర వాహనం తీసుకొని గుడిపూడి నుంచి పెదమక్కెన గ్రామానికి వెళ్లే క్రమంలో కల్వర్ట్‌ను ఢీకొట్టి పొలాల్లో పడిపోయాడు. శనివారం ఉదయం స్థానికులు చూసి మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి చంద్రరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని సత్తెనపల్లి రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి పాముకాటు

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల గ్రామానికి చెందిన బండి లక్ష్మీనారాయణ అనే యువకుడు శనివారం పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో నివాసముండే లక్ష్మీనారాయణ ఇంటి పక్కనే గడ్డిమోపు తీసే క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు సత్తెనపల్లిలోని వైద్యశాలకు తరలించారు. లక్ష్మీనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని స్థానికులు తెలిపారు.

అన్నప్ప సేవలు ఆదర్శనీయం

పెదకూరపాడు: హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ అవ్వారి చిన్న అన్నప్ప సేవలు ఆదర్శనీయమని భావన రుషి ఆలయ కమిటీ అధ్యక్షులు అనుముల వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని లగడపాడులో శనివారం భద్రావతి సమేత భావన రుషి దేవాలయ నిర్మాణాన్ని అన్నప్ప దంపతులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో పలువురు పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం సహాయం అందించిన మంచి వ్యక్తి చిన్న అన్నప్ప అని కొనియాడారు. దేవాలయాలకు కూడా పెద్దఎత్తున భూరీ విరాళాలు అందించారని తెలిపారు.

పోషకాహారంతో తల్లీబిడ్డా క్షేమం



75 తాళ్లూరులో పోషకాహారాన్ని అందిస్తున్న డాక్టర్ మౌనిక



అమరావతిలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ రవికుమార్, సుబ్బారావు

పెదకూరపాడు : గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని 75 తాళ్లూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ మౌనిక సూచించారు. రెండో శనివారం నేపథ్యంలో పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 తాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు, బాలింతలకు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పోషకాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ వైద్యులు సూచించిన మాత్రలతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుంటే తల్లీ బిడ్డా క్షేమంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, కొండవీటి ప్రసాద్, స్థానిక నేతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతిలో..

పెదకూరపాడు మండలంలోని 75త్యాళ్లూరుకు చెందిన బెజ్జం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆడిట్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.వి. సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు అదృష్టవంతులని, మరో బిడ్డకు జన్మనిచ్చే భాగ్యం వారికి దేవుడిచ్చిన వరమని తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ స్త్రీ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు వైద్యుల సూచనలను పాటిస్తూ, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోజన చైతన్య సమితి ప్రతినిధి మేకల శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.మహేశ్వరి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

సుస్థిర వ్యవసాయంతో ఆర్థిక పరిపుష్టి



అవగాహన కల్పిస్తున్న శ్యామ్ సుందర్ రెడ్డి

పెదకూరపాడు: సుస్థిర వ్యవసాయంతో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని రిటైర్డ్ ఏడీఏ బి.శ్యామ్‌సుందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని 75త్యాళ్ళూరులో శనివారం నీలగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మిర్చి పంట- సుస్థిర వ్యవసాయం 'పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల సమయంలో సూక్ష్మపోషకాలు పని చేయవని తెలిపారు. ప్రతి ఏడాది ఒకే ప్రదేశంలో మిర్చి నారుమళ్లు నాటరాదని, ఎత్తు నారుమళ్లు మంచిదని సూచించారు. నర్సరీ పద్ధతిలో మిర్చి నారు పెంపకం గురించి వివరించారు. నీలగిరి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ రత్తయ్య తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే విధానాన్ని వివరించారు. సాగులో విత్తనం, మొక్క నాటడం, కలుపు తీయడం, కాయ కోయడం, తాలు ఏరడం వరకు మహిళల పాత్ర ఎక్కువని, వ్యవసాయ శిక్షణ కార్యక్రమాల్లో వారు కూడా పాల్గొనాలని ఆయన తెలిపారు. నవరత్న పచ్చిరొట్ట సాగు ఉపయోగాల గురించి వివరించారు. ఎలక్ట్రిక్ ట్రాక్టర్ గురించి డీఎం మారుతి వివరించారు. మోనో గ్రోమోర్ ద్వారా రైతులకు అందించే ఉత్పత్తుల గురించి మేనేజర్ బాజీ, ఇంచార్జి శ్రీనివాస్ వివరించారు. జీవామృతం, పశువుల ఎరువులు, డ్రిప్ గురించి ప్రకృతి వ్యవసాయ రైతు గుత్తికొండ కోటిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.